క్లుప్తంగా

కమ్మర్‌గాం రోడ్డుకు మరమ్మతులు



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

పెంచికల్‌పేట్: మండలంలోని నందిగామ నుంచి అగర్‌గూడ, బెజ్జూర్ మండలంలోని ఏటిగూడ వరకు రోడ్డు మరమ్మతులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్సీ దండె విఠల్ విడుదల చేసిన నిధులతో పనులు ప్రారంభించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మధునయ్య, నాయకులు సముద్రాల రాజన్న, రాచకొండ కృష్ణ, బాపురావు, శంకర్‌గౌడ్, ఇలియాస్, చందు, రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

27న పద్మశాలి సంఘం ఎన్నికలు

ఆసిఫాబాద్: పట్టణ పద్మశాలి సంఘం ఎన్నికలు ఈనెల 27న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల నిర్వహణ అధికారి చెన్నూరి ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17, 18వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 19న పరిశీలన, 20న గుర్తుల కేటాయింపు ఉంటుందన్నారు. ఈ నెల 27న పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు ఉంటుందని, అనంతరం ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. పూర్తి సమాచారం కోసం సెల్ నంబర్లు 98664 08676, 94915 58632లలో సంప్రదించాలన్నారు.

పనులు పరిశీలించిన కేంద్ర బృందం సభ్యులు



చేపల పెంపకం వివరాలు తెలుసుకుంటున్న బృందం సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను సోమవారం జాతీయ స్థాయి పరిశీలన బృందం సభ్యులు పరిశీలించారు. మండలంలోని దుర్గానగర్, వల్లకొండ, కోసిని గ్రామపంచాయతీల్లో చేపట్టిన ఆయిల్‌పాం, చేపల పెంపకం, తదితర పనులను వారు పరిశీలించారు. అదేవిధంగా వివిధ పెన్షన్ లబ్ధిదారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బృందం సభ్యులు నాగరాజు, రఘునాథన్, నోడల్ అధికారి మల్లేశ్, ఎంపీడీవో రమేశ్, ఏపీవో బుచ్చన్న, ఏపీఎం భూమక్క, సాంకేతిక సహాయకులు శ్రావణ్, దేవేంద్ర, రమాదేవి, కిశోర్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎస్సై మృతి



గులాం మసూద్ అహ్మద్ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్‌రూరల్ సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తున్న గులాం మసూద్ అహ్మద్ సోమవారం మృతిచెందారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కొన్ని రోజులుగా గుండెపోటుతో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. మసూద్ అహ్మద్ పార్థివ దేహానికి డీఎస్పీ రామానుజం, పలువురు పోలీసు అధికారులు నివాళులర్పించారు. ఏఎస్సై మృతిపై జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పోలీసుశాఖ నుంచి అంత్యక్రియల కోసం తక్షణ సహాయంగా రూ. 20 వేలు అందించారు.

'ఎమ్మెల్యే వివేక్ వ్యాఖ్యలు సరికాదు'

ఎదులాపురం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చినటువంటి తీర్పునకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చేసిన వ్యాఖ్యలు సరికాదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత 70 సంవత్సరాల నుంచి మాదిగ ఉపకులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ, సంక్షేమ రంగాల్లో రావాల్సిన హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. అయితే తన రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో వివేక అర్థరహిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యల వెనుక సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉన్నట్టు కనిపిస్తుందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు గంగన్న., నవీన్, సూర్యకాంత్, ఎల్లన్న, గంగన్న, రాజు, శంకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాదయాత్ర

ఎదులాపురం: తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం నుంచి ఈనెల 29వ వరకు తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు సామల ప్రశాంత్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు.

తాగునీటికి తిప్పలు..!

- గ్రామంలో చేతిపంపు కరువు
- 'భగీరథ'పై కుదరని నమ్మకం
- చెలిమె నీరే దిక్కు
- ఇబ్బందుల్లో శివగూడ వాసులు



అసంపూర్తిగా మరమ్మతులు చేపట్టిన బావి



గ్రామస్తుల దాహం తీరుస్తున్న చెలిమె

కెరమెరి: అదొక చిన్న పల్లె.. అక్కడ ఉన్న వారంతా ఆదిమ గిరిజనులు.. ఏళ్లుగా గ్రామంలో నివసిస్తున్నా వారికి తాగేందుకు నీరు లేక తిప్పలు పడుతున్నారు. మండలంలోని బాబేఝరి గ్రామ పంచాయతీ పరిధిలోని శివగూడ గ్రామ ప్రజలు సమస్యలతో సావాసం చేస్తున్నారు. కనీసం తాగేందుకు తాగునీరు లేక చెలిమె నీటితో కాలం గడుపుతున్నారు. ఏళ్లుగా గ్రామంలో నివసిస్తున్నా ఒక్క చేతిపంపు కూడా లేదంటే వారి పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. గ్రామంలో 15 కుటుంబాలు ఉండగా, 65 మంది జనాభా నివసిస్తున్నారు.

మరమ్మతులు చేపట్టినా..

బావిలో కాలువ నీరు కలువకుండా మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు అధికారులు దృష్టికి తీసుకెళ్లగా ఉపాధిహామీ పథకంలో భాగంగా బావికి మరమ్మతు పనులు ప్రారంభించారు. సుమారు 15 మంది కూలీలు మూడు వారాలపాటు పనులు చేశారు. పూడిక తీశారు. కానీ పెద్ద బండరాళ్లు ఉండడంతో బావి మరమ్మతు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. తక్షణమే అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కోసం కొత్త చేతిపంపు ఏర్పాటు చేయాలని గిరిజనులు అధికారులను కోరుతున్నారు.

కాల కృత్యాలకే భగీరథ నీరు..

గ్రామంలో ఒక్క చేతిపంపు కూడా లేదు. మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నప్పటికీ ఆ నీటిని ప్రజలు తాగడం లేదు. మిషన్ భగీరథ నీటిని కాలకృత్యాలకు, బట్టలు శుభ్రం చేయడానికి మాత్రమే వినియోగిస్తున్నారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతపై అనేక అనుమానాలు ఉండడంతోనే ఆ నీటిని తాగేందుకు వినియోగించడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సరఫరా అవుతున్న మిషన్ భగీరథ నీటిలో జంతువుల ఎముకలు, చెట్ల బెరడ్లు వంటివి వస్తుండడంతో గ్రామస్తులు అపచారంగా భావిస్తున్నారు. దీంతో ఆ నీటిని తాగడం లేదు. తాగేందుకు నీరు లేకపోవడంతో గ్రామ సమీపంలో ప్రవహిస్తున్న కాలువ పక్కనే చెలిమె తీసి ఆ నీటిని వాడుకుంటున్నారు. కాగా చెలిమె నీటికి సమీపంలోనే బావి ఉన్నప్పటికీ బావిలోని నీరు దుర్వాసన వస్తుందని, కాలువ నీరు బావిలో కలుస్తుండడంతో నీరు కలుషితమవుతుందని వారు పేర్కొంటున్నారు.



మిషన్ భగీరథ నీటి ట్యాంకు

మరమ్మతులు పూర్తి చేయాలి



తాగేందుకు నీటి సదుపాయం లేకపోవడంతో చెలిమె నీటిని తాగుతున్నాం. గతంలో కాలువ సమీపంలోని బావికి మరమ్మతులు చేపట్టినప్పటికీ పెద్ద బండరాళ్లు ఉండడంతో అలాగే వదిలేశారు. అధికారులు స్పందించి మరమ్మతులు పూర్తి చేయాలి.

– సిడాం మానిక్‌రావు, శివగూడ

నాణ్యమైన నీరు అందేలా చూస్తాం



మరమ్మతులకు నోచుకోని మంచినీటి బావిని పరిశీలిస్తాం. సాధ్యమైతే మళ్లీ పనులు ప్రారంభిస్తాం. మిషన్ భగీరథ క్వాలిటీ అధికారులతో మాట్లాడి నాణ్యమైన నీటిని అందించేలా ఆదేశాలు జారీ చేస్తాం. శివగూడ సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తాం.

– అంజద్‌పాషా, ఎంపీడీవో, కెరమెరి

'శోభ అందరికి ఆదర్శం'



శోభాబాయిని శాలువాతో సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

కెరమెరి: పేద కుటుంబంలో పుట్టి, ఎన్నో కష్టాలు అధిరోహించి ఇటీవల ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన పంద్రం శోభాబాయి అందరికి ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం మండలంలోని చౌపన్‌గూడలో శోభాబాయికి గ్రామస్తులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తాను జిల్లా కేంద్రంలో ప్రారంభించిన స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకుని టీచర్ ఉద్యోగానికి ఎంపిక కావడం తనకు సంతోషదాయకమన్నారు. పేద ఆదివాసీలు ఉద్యోగాలు సాధించడమే ధ్యేయంగా స్టడీ సర్కిల్ ప్రారంభించామన్నారు. కెరమెరి, ఉట్నూర్ మాజీ ఎంపీపీలు పెందోర్ మోతీరాం, జైవంత్‌రావు, మాజీ వైస్‌ఎంపీపీ అబ్దుల్ కలాం, నాయకులు న్యానేశ్వర్, బొజ్జిరావు, దుందేరావు, రాము, మోతీరాం, జగన్నాథ్‌రావు, తుకారాం తదితరులు ఉన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న రూప్‌లాల్

కెరమెరి: ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికైన మండలంలోని బొగడగూడకు చెందిన రాథోడ్ నరేశ్, రాథోడ్ మహేశ్, రాథోడ్ సువర్ణలను సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ సోమవారం బొగడగూడ గ్రామంలో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ కష్టపడితే ఫలితం తప్పకుండా ఉంటుందని వీరు నిరూపించారన్నారు. సంఘ సభ్యులు పిరాజి, రవీందర్, సంతోష్, గ్రామ పెద్దలు తుల్సిరాం, తిరుపతి, వెంకట్రాం తదితరులు ఉన్నారు.

పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే హరీశ్‌బాబు, ఎంపీ గోడం నగేశ్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు హాజరయ్యారు. ముందుగా బతుకమ్మలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రెస్‌క్లబ్ ముందు జాతీయ జెండా ఎగురవేసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మారుమూల దహెగాం మండల పాత్రికేయులు ఆదర్శమన్నారు. ఐక్యంగా ఉండి ప్రెస్‌క్లబ్ భవనాన్ని నిర్మించుకోవడం హర్షనీయమన్నారు. ఎంపీ గోడం నగేశ్ మాట్లాడుతూ జర్నలిస్టులకు రైల్వేలో రాయితీ ప్రయాణం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జర్నలిస్టులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అన్నదాతలు



కౌటాల- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

కౌటాల: రైతులకు సక్రమంగా త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కౌటాల మండలం గుడ్లబోరి, గుండాయిపేట, మొగడ్‌దగడ్, తుమ్మిడిహెట్టి గ్రామాల రైతులు కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట, కౌటాల -కాగజ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గత 15 రోజులుగా వర్షం లేక వరి పంటలు ఎండిపోతున్నాయని, రోజూ రెండు, మూడు గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా చేస్తుండడంతో పంటలకు సాగునీరు అందించలేకపోతున్నామన్నారు. విద్యుత్ లోవోల్టేజీ కారణంగా విద్యుత్ మోటర్లు కాలిపోతున్నాయని, విద్యుత్ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నాణ్యమైన విద్యుత్ అందించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ సమస్య లేకుండా చూస్తామని విద్యుత్‌శాఖ అధికారులు సమాధానం ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అవినీతి లేని పాలనే బీజేపీ లక్ష్యం

- ఎంపీ గోడం నగేశ్



బెజ్జూర్‌లో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేశ్

బెజ్జూర్: దేశంలో కేంద్ర ప్రభుత్వం అవినీతి లేని పాలన అందిస్తుందని, జిల్లాలో సైతం అవినీతి లేని పాలన ప్రజలకు అందిస్తున్నామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సభ్యత్వ నమోదుపై కార్యకర్తల సమావేశంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ మండలంలో అటవీశాఖ అనుమతులు లేక నిలిచిన రోడ్లకు అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆవాస్ యోజన కింద గృహాలు మంజూరు చేస్తుందన్నారు. సభ్యత్వ నమోదు జిల్లా ప్రముక్ నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి తిరుపతి, ఉపాధ్యక్షుడు జయరాజ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం, మండల అధ్యక్షుడు ఉమ్మెర బాలకృష్ణ, మాజీ జెడ్పీటీసీ పాల్వాయి సుధాకర్ రావు, పార్టీ నాయకులు కొప్పుల శంకర్, తాళ్ల రామయ్య, సామల తిరుపతి, వసీఉల్లా ఖాన్, శంకరయ్య, రాజారాం, సంతోష్, సంజీవ్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. కాగా మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో ఎంపీని పార్టీ కార్యకర్తలు, ఆదివాసీ నాయకులు ఘనంగా సన్మానించారు.

సభ్యత్వ నమోదులో క్రియాశీలకంగా వ్యవహరించాలి

పెంచికల్‌పేట్: బీజేపీ సభ్యత్వ నమోదు ప్రక్రియలో ప్రతీ కార్యకర్త క్రియాశీలకంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే డా.పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎంపీ గోడం నగేశ్‌తో కలిసి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతీ గడపకు తీసుకెళ్లాలని సూచించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈసందర్భంగా మండలంలోని సమస్యలను పరిష్కరించాలని పలువురు నాయకులు ఎంపీ నగేశ్‌కు వినతిపత్రాలు అందజేశారు.

డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

బోథ్: మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం ఇవ్వకపోవడంతో డిగ్రీ కళాశాలలను యాజమాన్యాలు నిరవధికంగా బంద్ నిర్వహించారు. మండల కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాల గేట్‌ను మూసి ఉంచారు. గేట్‌కు బంద్‌కు సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. కళాశాల బంద్ ఉండడంతో విద్యార్థులు వెనుదిరిగారు. తమ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని యాజమాన్యాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఫీజులు విడుదల చేయకపోవడంతో సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వాపోయారు.

అరకొర సౌకర్యాలతో అవస్థలు

- ఇరుకుగదులతో విద్యార్థులకు తిప్పలు
- ప్రతిపాదనలు పంపినా పట్టించుకోని ప్రభుత్వం



రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం

రెబ్బెన: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పే కళాశాల అరకొర సౌకర్యాలతో కొట్టుమిట్టాడుతోంది. రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇరుకు గదుల నడుమ విద్యా బోధన సాగుతోంది. విద్యార్థుల సంఖ్యకు సరిపడా తరగతి గదులు లేకపోవటంతో ఉన్న గదుల్లోనే విద్యార్థులు సర్దుకుంటున్నారు. ఏటా కళాశాలలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా ప్రభుత్వం సౌకర్యాలు మాత్రం కల్పించడం లేదు. గదుల కొరత కారణంగా ఒక్కో గదిలో మూడు, నాలుగు సెక్షన్లకు చెందిన విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. తరగతి గదుల్లోనే ల్యాబ్‌లు సైతం నిర్వహిస్తున్నారు. సరిపడా తరగతి గదులు నిర్మించాలని విద్యార్థి సంఘాలు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ప్రభుత్వం స్పందించడం లేదు.

755 మంది.. 10 గదులు

రెబ్బెన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు 755 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొదటి సంవత్సరంలో 340 మంది, రెండో సంవత్సరంలో 415 మంది విద్యార్థులు ఉన్నారు. కళాశాలలో ఒకేషనల్, జనరల్ గ్రూపులు ఉండగా జనరల్ గ్రూప్ విద్యార్థులకు కేవలం 4 గదులు, ఒకేషనల్ విద్యార్థులకు 6 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. జనరల్ గ్రూప్ విద్యార్థుల కోసం నిర్మించిన 4 గదుల్లో ఒక గదిని ప్రిన్సిపాల్, స్టాఫ్‌రూంకు కేటాయించటంతో మిగిలిన మూడు గదుల్లోనే ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు బోధిస్తున్నారు. సరిపడా గదులు లేకపోవడంతో అరకొరగా ఉన్న గదుల్లోనే ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. ఇక ఒకేషనల్ గ్రూప్ కోసం 6 గదులను నిర్మించగా ఒక్కో గదిలో నాలుగేసి సెక్షన్లను నిర్వహించాల్సిన దయనీయ పరిస్థితి ఉంది. తరగతులకు సరిపడా గదులు లేకపోవటంతో ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీజీటీలకు చెందిన నాలుగు సెక్షన్లను ఒకే గదిలో నడుపుతున్నారు. ఎంఎల్‌టీ మొదటి, ద్వితీయ సంవత్సరం తరగతుల కోసం ఒక గదిని, కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ, ఆటోమోబైల్ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం మరో గదిని, ఆర్‌ఎం మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం ఒక గదిని, కంప్యూటర్ సైన్స్ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల కోసం ఒక గదిని కేటాయించారు. మిగిలిన మరో గదిలో ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరం తరగతులు కొనసాగిస్తున్నారు. తరగతి గదుల్లోనూ ల్యాబ్‌ల నిర్వహణ కోసం అవసరమైన రసాయనాలు ఉంచడంతో ఏ క్షణాన విద్యార్థులకు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి ఉంది. సరిపడా స్థలం లేని కారణంగా ల్యాబ్ చేసే సమయంలో రసాయనాలు కింద ఒలికి విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు సైతం చోటు చేసుకుంటున్నాయి.

అదనపు గదులు అవసరం..

కళాశాలలో విద్యార్థుల సంఖ్యకు సరిపడా సౌకర్యాలు మెరుగుపడాలంటే అదనంగా మరో 26 గదులు ఏర్పాటు చేయాల్సి ఉంది. వాటిలో జనరల్ విద్యార్థుల ల్యాబ్‌ల కోసం 4 గదులు, తరగతి గదుల కోసం 6 గదులు, కంప్యూటర్ ల్యాబ్ కోసం 1, స్టాఫ్ రూం కోసం 1 గది అవసరం ఉంది. అలాగే ఒకేషనల్ విద్యార్థుల తరగతుల నిర్వహణ కోసం 8 అవసరం ఉండగా, ల్యాబ్‌ల ఏర్పాటు కోసం మరో 7 గదులు అదనంగా నిర్మించాల్సి ఉంది. అయితే అదనపు తరగతి గదుల కోసం కళాశాల సిబ్బంది ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రావడం లేదు. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో కళాశాలను ఇందిరానగర్ సమీపంలో నిర్మించారు. అయితే కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది.

గదులు సరిపోవడం లేదు

కళాశాలలో గదుల కొరత ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం జనరల్ విద్యార్థుల కోసం మూడు గదులు, ఒకేషనల్ విద్యార్థుల కోసం 6 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. వాటిలోనే తరగతులు, ల్యాబ్‌లను నిర్వహిస్తున్నాం. కళాశాలలో 20 పీరియడ్స్ నడుస్తాయి. వాటితో పాటు ల్యాబ్‌లకు ప్రత్యేకంగా గదుల అవసరం ఉంది. గదుల కొరత తీవ్రంగా ఉండటంతో అదనపు తరగతి గదుల కోసం ప్రభుత్వానికి నివేదికలు అందించాం.

– అతియాఖానం, ప్రిన్సిపాల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల: కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొత్త బూస్టర్ పీటీఆర్‌ను మంగళవారం ఏర్పాటు చేస్తున్నట్లు కౌటాల ఏఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో పనుల కారణంగా నేడు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. కౌటాల, చింతలమానెపల్లి మండలాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ సహకారం, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల గురించి ఆలోచించే ఏకైక ప్రభుత్వం తమదన్నారు. రైతులు ప్రైవేటు దళారులకు పంటలను అమ్మి మోసపోవద్దన్నారు. సోయాబీన్ కనీస మద్దతు ధర రూ. 4892 రూపాయలు ఉందని, రైతులు తమ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే అమ్మి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఆడిటర్ సుజాత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, ఎండీ మసుద్, మెస్రం నాగ్‌నాథ్, జహీర్, సోమోరే నాగోరావ్, కొమరయ్య పాల్గొన్నారు.